కథ

# కొండ దేవుడు

బండి విహారి

కొండ మలుపుల్లో నెమ్మదిగా వెళ్తోంది బస్సు డ్రైవర్ చూపుల్ని అనుసరిస్తూ. నా చూపులు మాత్రం అటుగా వెళ్ళే ఆకుపచ్చ అందాలన్నింటినీ పలకరించి పులకరిస్తున్నాయ్.

తల ఆరబెట్టుకుని నవ్వే వృక్షాలూ, ఏపుగా పెరిగిన చెట్లూ ఆకుపచ్చని పొదలూ, అన్నీ కనుచూపుమేరలో తమ సామ్రాజ్యాన్ని విస్తరింపజేస్తున్నాయి.

బస్సు వేగాన్ని అనుసరించి గాలి తగుల్తోంది నా మొహానికి చల్లగా... చలిగా.

బయట ప్రవహిస్తున్న చూపును బస్సులో పడవేశాను. అస్తవ్యస్తంగా కూర్చుని పక్కవారి భుజాలపై తలలు వాల్చి నిదురపోతున్నారు మా అయ్యప్పలు.

వెనుకనుండీ నాలుగైదు గొంతులు విని పిస్తున్నాయ్ బస్సు శబ్దంలో కలిసిపోయి.

నా భుజంపై తలను వాల్చి నిదురపోతున్నాడు ప్రసాద్. అప్పుడప్పుడూ, చిట్టడవిలా పెరిగిన గెడ్డాన్ని గీరుకుంటున్నాడు నిదురలో. మాల వేయక ముందు నేను చూసిన ప్రసాద్‌కీ, ఈ ప్రసాద్‌కీ చాలా తేడా వుంది. మీసాలే లేని ఆ ప్రసాద్ ముఖంపై నల్లటి మీసాలు పెరిగి రెండు పాయలుగా కిందకు చీలి ఆ చిట్టడవిలో కలిసిపోయాయి.

నాకూ ప్రసాద్‌కూ చిన్నప్పట్నుంచీ స్నేహం. వాడి కుటుంబానికీ, మా కుటుంబానికీ, మేం కళ్ళు తెరవకముందు నుండీ స్నేహం. వాడు వయసులో నాకన్నా రెండేళ్ళు పెద్దవాడు.

ప్రసాద్ గురించి చెప్పాలంటే చాలా వుంది. 'చాలా వుంది' అంటే, చెప్పినంతా వుంది అని అర్థం.

ఎవరినీ పల్లెత్తు మాటైనా అననివాడు. అందరితో 'మంచి' అనిపించుకోవాలనుకునే వాడు. దానికోసమే ప్రయత్నించేవాడు. దైవ భక్తి పారాయణుడు. వాడి భక్తిని సూచిస్తూ వాడి కనుబొమ్మల మధ్యభాగం ఎప్పుడూ ఎర్రగా వెలుగుతూ ఉంటుంది కుంకుమతో.

కర్ణుడికి కవచకుండలాలు ఎంత సహజమో వీడికీ కుంకుమబొట్టు అంత సహజంలాగుంటుంది.

వాడి భక్తి ఎలాంటిదంటే- వాడికి ఎక్కడైనా దేవుడి ఫోటో కనిపించడమే ఆలస్యం వెంటనే వాడి కళ్ళు అవంతటవే మూతలు పడి, చేతులు చంపల్ని తగులుతాయి ఎక్స్ ఆకారంలో. ఈ చర్య యాంత్రికంగా జరిగిపోతూ వుంటుంది రోజూ. ఇది మాకు అలవాటే.

పాపం... ప్చ్! ఇక మా ప్రసాద్ బాధిత దేవుళ్ళ గురించి చెప్పాలంటే- భక్తులందర్నీ దీవించిన తర్వాత దేవుడు హాయిగా, నిబ్బరంగా విశ్రాంతి తీసుకుంటాడంట. అప్పుడు



కానీ ఈ ప్రసాద్ కంటపడితే 'అమ్మయ్యో! వీడొచ్చెనా' అని బిరబిరా కాళ్ళు మడిచి పద్మాసనం వేసుకుని, ఎడమచేయి పైకి, కుడిచేయి కిందకు పెట్టి కూచుంటాడంట. వెంటనే నాలుక్కొరుక్కుని, తప్పు తెలుసుకుని చేతుల్ని మార్చి బలవంతాన నవ్వుతూనే ఒకసారి తనను తాను పరిశీలించుకుంటాడంట తన దేవుడి ఫోజ్‌లో.

వీడు బాపనోళ్ళల్లో పుట్టాల్సినోడు. కర్మకాలి మా ఇండ్లల్లో పుట్టినాడు అని మా పెద్దమ్మ అన్నప్పుడల్లా- 'అవునవును' అన్నట్టు నిట్టూర్చేవి వాడి కళ్ళు నేలకేసి చూస్తూ.

అమావాస్యపూట కాలికి కాటుక అంటించుకోనిదే వాడు ఇల్లు దాటింది లేదు. అలా అని సాయంత్రం ఏడుపైన బయట తిరిగిందీ లేదూ.

ఎప్పుడైనా వారి దర్శనం కోరి నేను వాళ్ళింటికి వెళితే కనీసం అర్ధగంటైనా పూజ చేయనిదే నా లాంటి 'ప్రజ'కి దర్శనమివ్వరు మానుభావులు!!!

నా ఆర్థిక పరిస్థితి వేరే, ప్రసాద్ ఆర్థిక పరిస్థితి వేరే. వాడి పేదరికమే వాడ్ని ఇంతటి భక్తిలోకి లాక్కుందని నా అభిప్రాయం.

***

చిన్నప్పట్నుంచీ అయ్యప్ప స్వామంటే నాకు  నాకే తెలియని అమితమైన ప్రేమ, భక్తి.

అయ్యప్ప బట్టలు కట్టుకుని, మెడలో మాల వేసుకుని భజన చేస్తూ ఆయన భక్తిలో లీనం కావాలనుండేది. నిరాడంబరంగా అందర్నీ ప్రేమిస్తూ సన్యాసిగా వుండాలనుండేది. ఎన్నాళ్ళనుండో వున్న కోరిక ఇప్పుడు తీరింది. నేనూ, ప్రసాద్ అనుకోకుండా 'మాల' వేయడం జరిగింది.

ఇంటికి దగ్గరగా ఒక రూము అద్దెకు తీసుకున్నాం. మాది మేడపైన ఒంటరిగది. గది ముందు కావాల్సినంత ఖాళీ స్థలం. ఇకపై మా సంసారమంతా ఈ రూములోనే ఓ నలభై రోజులపాటు.

ఈ అయ్యప్పస్వామి దీక్షలో నాకు ఎదురైన ఓ మూడు సంఘటనల గురించి చెప్పాలనుంది నాకు. వినండి.

మేము మాల వేయడానికి సరిగ్గా ఒకరోజు ముందనుకుంటా... రూములో వంట వండుకోవడానికని బియ్యమూ, గిన్నెలూ, ప్లేట్లూ అన్నీ సర్దుతున్నాం ఇంట్లో.

'ఏం పిన్నమ్మా అయ్యిందా?' అంటూ లోపలికొచ్చాడు ప్రసాద్.

'ఆ... ఆ... అయ్యిందిగానీ నాలుగు గ్లాసులు చాలుకదా? రెండు తట్టలు పెట్టినాను' అంది మా అమ్మ.

కుర్చీలో కూర్చున్న వాడి చూపులు వెనక్కి వాలాయి వాడి మెడతో పాటుగా, వంట్రూములో వున్న అమ్మ వైపు.

'అవన్నీ ఎందుకు పిన్నమ్మా? అన్నీ మాంసం కూర వండిండేటివే కదా!' అన్నాడు. చెప్పిన విషయాన్నే పదోసారో పదకొండోసారో చెబుతున్నట్టు.

'నువ్వీ మాట అంటావనే ఇంకా బాగా కడిగినాన్రా!'

'ఎంతన్నా కడుగూ, నీచు అంటిండేటివి ఇంగంతే!' తేల్చి చెప్పాడు ప్రసాద్.

'పోనీ గ్లాసులూ...'

'అవ్వీ వద్దు. ఎవరెవరో తాగింటారు. కొత్తవి కొంటాంలే' అన్నాడు బియ్యం కొలుస్తున్న నా వైపు తిరిగి.

వీని వాలకం చూస్తోంటే, ఇప్పట్నుంచీ ఈ భూమ్మీద బతికేట్లు లేదు. దుమ్ము, ధూళీ అంటకుండా పైపైనే కాపురముండేట్లున్నాడు.

'పరిశుద్ధత వుండాల్సింది మనస్సులోనా? లేక తట్టల్లోనూ, బుట్టల్లోనూనా?' అని అడగాలనుకున్న ప్రశ్నను గొంతులోనే దిగమింగుకున్నాను, ప్రసాద్ తలపై అప్పుడే మొలచిన బ్రాహ్మణ పిలకను ఆశ్చర్యంగా చూస్తూ.

ఒక్కసారిగా మారిపోయినట్టున్నాడు ప్రసాద్.

బ్రాహ్మణ వాదాన్ని స్వీకరించిన శూద్ర బ్రాహ్మణుడిలాగ.

ఈ శూద్ర బ్రాహ్మణుడి వెనుక-

ఇంకొకర్ని వట్టి పిరికిపందలుగా మారిస్తే తప్ప తమ కడుపులు నిండని బ్రాహ్మణ పూజారులు కసాయివృత్తి కనిపిస్తోంది. ఈ పిలక సామర్థ్యం ఎంత గొప్పదంటే, ఇంతగా విమర్శిస్తున్న నన్నే ఒకసారి తలక్రిందులుగా బోల్తా కొట్టించిన సందర్భానికి గురి చేసింది. అప్పుడు నాకు నేనే కొత్తగా కన్పించాను.

***

ఉదయం ఏడు గంటలకు హడావిడి పరిగెడుతోంది మా రూములో. గుడికి వెళ్లడం రాత్రి తిని పాడేసిన సామాన్లని కడగటం, టిఫిను వండటం, తినటం, కారియర్లు కట్టుకోవటంతో ఓ కొలిక్కి వచ్చాయి పరిగెడుతున్న మా నాలుగు కాళ్ళూ.

నిజం చెప్పాలంటే ప్రసాద్‌లో హడావిడి రెండు రోజుల కిందటే మొదలయ్యింది. డిప్యూటీ డి.ఇ.ఓ. ఇన్‌స్పెక్షన్‌కు వస్తున్నాడని తెలియడంతో. రెండు రాత్రులు ఒంటిగంటవరకూ లెస్సన్‌ప్లానులు రాస్తూ కూర్చున్నాడు.

రోజూ గుడిలో భజన చేసి ఒక గంట లేటుగా నిబ్బరంగా వెళ్ళేవాడు స్కూలుకి. కానీ ఈరోజు భజనలో కూర్చోకుండానే వచ్చేశాడు రూముకి. ఏదో పనుందని.

పూజ కూడా మనశ్శాంతిగా చేసినట్లు లేదు. తనలో తాను విసుక్కుంటున్నాడు. ఎవరి కారియర్లు వారు తీసుకుని బయట పడ్డాం.



**రోజూ గుడిలో భజన చేసి ఒక గంట లేటుగా నిబ్బరంగా వెళ్ళేవాడు స్కూలుకి. కానీ ఈరోజు భజనలో కూర్చోకుండానే వచ్చేశాడు రూముకి. ఏదో పనుందని.**

**పూజ కూడా మనశ్శాంతిగా చేసినట్లు లేదు. తనలో తాను విసుక్కుంటున్నాడు. ఎవరి కారియర్లు వారు తీసుకుని బయట పడ్డాం.**

'అయ్యో స్వామీ! బొట్టు పెట్టుకోలేదే?' అన్నాను.

చేతివేళ్ళతో తన నుదురుని తడుముకుని- 'అవునే!' అని మళ్ళీ లోపలికెళ్ళి చందనం దిద్దుకుని వచ్చాడు.

'నువ్వు బీగమేసిరా స్వామీ... నాకు టైమైంది నేను పోతాను' అంటూ కిందకు పరిగెత్తాడు.

'నీ స్కూటర్ని మర్చిపోయి పరిగెత్తేవ్ స్కూలుకి' అన్నాను నవ్వుతూ నా మాట వినీ విననట్టు వెళ్ళిపోయాడు.

తలుపుకి బీగమేసి కిందకి వెళ్ళాను. కాంపౌండ్ బయట తన స్కూటర్‌పై కూర్చున్నాడు ప్రసాద్ తలను చేతుల్లో పెట్టుకుని.

'ఏం స్వామీ ఇంకా పోలేదా?' అడిగాను.

'ఖర్మ స్వామీ... అంతా న కర్మ బయల్దేరతాంటే శనిదేవతలా ఎదురొచ్చింది ఆ శవం' అంటూ అటుగా వెళ్తున్న శవం వైపు చూపించాడు.

దారంతా బొరుగులు పడ్డాయి తెల్లగా. ఇటుగా శవం వెళ్ళిందనడానికి గుర్తుగా.

'శవం ఎదురొస్తే మంచిదిలే' అన్నాను.

'మంచేం మంచి? అనా కొడుకు ఇప్పుడే సావల్లా!' అని నాలుక్కరుచుకుని లెంపలేసుకున్నాడు.

'ఇప్పుడేం చెయ్యల్ల అయ్యప్పా! శవం ఎదురొస్తే వెంటనే స్నానం చేయాలంటారు. కానీ టైం లేదు. అసలే ఆ డిప్యూటీ డి.ఇ.ఓ. చాలా స్ట్రిక్ట్ అంట' అంటూ మొహానికి పట్టిన చమటను చేతితోనే తుడుచుకున్నాడు.

అదంతా లేదులే స్వామీ, ఎవరు చెప్పింది శవమెదురొస్తే స్నానం చెయ్యమని? అంతా మూఢనమ్మకం అన్నాను. ధైర్యం చెబుతూ.

'అయ్యో లేదు... లేదు. నిష్ట చెడుతుంది స్నానం చెయ్యకుంటే అని కాంపౌండ్ లోపలికి పరిగెత్తాడు. తన దారి తనదైనట్టు.

ఓ మూల కుండలోనికి చెయ్యి ముంచి మునివేళ్ళతో మూడుసార్లు నీళ్లని చిలకరించుకున్నాడు తల మీద.

'స్వామి శరణం... స్వామి శరణం.. స్వామీ తప్పైంది' అని మళ్ళీ లెంపలేసుకున్నాడు కళ్ళు మూసుకుని.

'వస్తా స్వామీ టైమైంది' అని బండిని స్టార్ట్ చేయడంతో తేరుకున్నాను నేను.

'ఏం స్వామీ పాపం ఇంక రాదా?' అడిగాను ఆశ్చర్యంగా. నా వైపు కోపంగా చేసి ముందుకు కదిలాడు. రోడ్డు మీద చల్లాచదురుగా పడిన బొరుగులను తొక్కకుండా జాగ్రత్త పడుతూ.

ఎంత తెలివి? హమ్మ దేవుడా! వీడు నిజంగానే ఇక్కడ పుట్టాల్సినోడు కాదు. ఖచ్చితంగా నిష్ఠాగరిష్టులైన బ్రాహ్మణోత్తముల్లో ఏ సోమయాజులు గారికో పుట్టాల్సినోడు. లేకపోతే దైవాన్ని దత్తత తీసుకున్న బ్రాహ్మణుడిలాగా తన అవసరాల కోసం తన నమ్మకాన్ని, భక్తిని కొంచెం సడలించుకునే శక్తి ఇంకెవరికి వుంటుంది?

భక్తి భక్తుణ్ణి ఉన్నతుడ్నీ, ధైర్యవంతుడ్నీ చేయలేకానీ ఇలా చెమటలు కక్కుకుంటూ పొంగిపొరలే భక్తి భయాన్నీ, బానిసత్వాన్నీ తప్ప, సత్యాన్ని ఎప్పటికైనా మనలో ఆవిష్కరిస్తుందా?!!

ఎక్కడో సమన్వయం దెబ్బతినింది. మనిషికీ, మనిషి ఆలోచనలకీ మధ్య.

***

పూర్వం అయ్యప్పస్వామిని భర్తగా పొందడానికి ఒక స్త్రీ ఘోరతపస్సు చేసిందట. ఆమెని "మాళికాపురత్తమ" అంటారులెండి. ఆమె తపస్సుకు మెచ్చి నీ కోరికేమని అడిగితే- "నీ భార్యను కావాలనుంది" అని

కోరుకొందట.

అప్పుడు అయ్యప్ప– "నేను బాల బ్రహ్మచారిని కాబట్టి నీ కోరిక అసంభవం, ఇంకేదైనా కోరుకో" అన్నాడంట.

కానీ మాళికాపురత్తమ తన పట్టు విడువకపోవడంతో స్వామి– 'సరే నా కొండకు ఏనాడైతే ఒక్క కన్నెస్వామి కూడా రాడో, అప్పుడు నిన్ను పెళ్ళి చేసుకుంటాను' అన్నాడంట.

అందుకని, ఆ మాళికాపురత్తమ తన మాయచేత దీక్షలో వున్నవారిలో కామం పుట్టించి, దీక్షని భగ్నం చేయగలదని అందరి అయ్యప్పల నమ్మకం. అందుకే అయ్యప్పలు స్త్రీలకు దూరంగా ఉంటారు.

మా ప్రసాదైతే మరీనూ... వాడీమధ్య సాయంకాలంపూట్ల మొహం మీద గుడ్డ కప్పుకుని తిరుగుతున్నాడంట వీధుల్లో. మా చుట్టుపక్కల వున్నవాళ్ళందరూ వచ్చి నన్ను ఒక్కటే అడగటం.

'ఏమైందీ?' నిన్నా మొన్నటివరకూ బాగున్నాడే!' అనీ.

'అయ్యో ఎప్పట్నుంచీ?!' అనీ.

'అలా జరిగిండకపోవాల్సింది... ప్చ్' అని పెదవి విరిచేశారు మరికొందరు.

మా ఎదురింటి భక్తుడొకాయనయితే ఏకంగా పూలూ, పళ్ళూ తీసుకుని దిగబడ్డాడు రూములోకి, దేవుడొచ్చాడని.

ఉదయంపూట స్కూలుకి బాగానే పోతున్నాడు. సాయంకాలం రూములో కూడా బాగానే వుంటున్నాడు. కానీ ఎటొచ్చీ బయటే అలా భయపెడ్తున్నాడంట అందర్నీ.

మొదట నేను నమ్మలేదు సుమా! కానీ, నా కళ్ళతో, దాక్కుని నిజం చూసేసరికి నమ్మక తప్పింది కాదు. నన్ను నేను గిచ్చుకునీ కొరుక్కునీ. ఒకరోజు సాహసం చేసి అడిగాను ప్రసాద్‌ని–

'ఏం స్వామీ ఏమైంది?' అని జాలిగా మొహం పెట్టి.

'ఏమైంది? ఏంలేదే? అన్నాడు మామూలుగానే.

'ఎట్లుంది ఒంట్లో?'

'బాగుందే!'

బాగా పలకరించి చూశాను. మనిషిలో ఏ మార్పూ లేదు.

'ముఖం మీద టవల్ కప్పుకుని తిరుగుతున్నావంటనే' అడిగాను. కరుస్తాడనే భయంతో కొంచెం దూరం జరిగి.

రూములో నిశ్శబ్దం గంభీరంగా మారింది.

'ఓహ్ అదా!' అన్నాడు.

'ఊ... అదే!' అన్నాను.

తను చేస్తున్న పనిని పక్కన పెట్టి నా వైపు చూశాడు. నేను మూసిన తలుపు వైపు చూశాను. మొదలుపెట్టాడు–

'ఏం లేదు స్వామీ... ఈ మధ్య నాలోకి మాయ దూరింది' అన్నాడు సీరియస్‌గా నా కళ్ళలోకి చూస్తూ.

'ఏం మాయ?' అడిగాను, గాలిని బలవంతంగా లోనికి పీలుస్తూ.

ఈ మధ్య వీధిలోని ఆడస్వాములు చానామంది నాతో మాట్లాడ్డానికని వచ్చి నా మొహంలోకి గుచ్చి గుచ్చి చూస్తున్నారు' అన్నాడు ఒత్తి పలుకుతూ.

'అయితే?' అడిగాను. ఏదో బరువు దిగిపోయినట్టు.

అందుకే ఏ చెడు ఆలోచనలూ రాకుండా టవల్ కప్పుకుని తిరుగుతున్నా' అన్నాడు మన్మధుడు.

'హమ్మయ్యా!' అనుకున్నాను నా శ్వాస దానంతటదే ఆడుతోంది హాయిగా.

నిమిషంసేపు ఆగి నా దగ్గరగా జరిగి కూర్చున్నాడు స్వామి! నేను టవల్ కప్పుకుని తిరుగుతున్నా, అంతా గమనిస్తానే వుంటిలే! నేనెంత మొహం దాచుకున్నా ఈ ఆడస్వాములు అందరూ నా దిక్కే చూస్తాందారు విడ్డూరంగా' అన్నాడు మొహం ముడుచుకుని.

'బహుశా నీ మొహం వెతుకుతుంటారులే

**మాళికాపురత్తమ తన మాయచేత దీక్షలో వున్నవారిలో కామం పుట్టించి, దీక్షని భగ్నం చేయగలదని అందరి అయ్యప్పల నమ్మకం. అందుకే అయ్యప్పలు స్త్రీలకు దూరంగా ఉంటారు. మా ప్రసాదైతే మరీనూ... వాడీమధ్య సాయంకాలంపూట్ల మొహం మీద గుడ్డ కప్పుకుని తిరుగుతున్నాడంట వీధుల్లో.**

స్వామీ' అన్నాను.

ఇంకేం మాట్లాడ్డానికి నాకు నోరు రాలేదు.

ఆలోచనలు లోపల్నుండే కాదు బయట ఎక్కడ్నుంచో వస్తాయని గుడ్డ కప్పుకునే ప్రసాద్‌కి ఏం చెప్పాలో అర్థంగాక, తలుపు తోసుకుని బయటికెళ్ళి గిలగిల్లాడాను కాసేపు ఆయన 'నిష్ట'కు తట్టుకోలేక.

పాపం... మా ప్రసాద్ హిపోక్రట్ కాదు.

***

చీకటి మందమవుతోండగా మేం ఎరమేలి చేరుకున్నాం. ఊరికి నాలుగైదు కిలోమీటర్ల దూరం నుండే, వెహికల్ స్టాపింగ్ మొదలయ్యింది.

అంతా సందడిగా వుంది. బ్రహ్మోత్సవాలు జరుగుతున్నంతగా. ఇక్కడ అయ్యప్పలు అందరూ మొహాలకి రంగులు పూసుకుని తప్పెట శబ్దానికి అణుగుణంగా పేటతుళ్ళి ఆడతారు.

పేటతుళ్ళి ఆడటమంటే ఎగరడమే.

మేమూ, ఒకరి మొహాలకొకరం రంగులు పూసుకున్నాం.

కొత్త మొహాల్లోనుండీ తొంగిచూసే పాత మొహాలను గుర్తు పడుతూ నవ్వుకున్నాం అందరమూ.

'స్వామీ! మా స్వామిని చూస్తివా?' అని ఒకరడిగితే,

'మా స్వామెవరు?' అని ఇంకొకరు దొంగలా చూస్తే,

'అయ్యో నువ్వేనా!' అని నవ్వుతున్నారు అందరూ.

తెలిసిన మొహాలే తెలియని అస్థిత్వాలైపోయాయి.

మా బస్సు ఏజెంట్ తప్పెట కొట్టేవారితో బేరం కుదిర్చాడు. ఈ రంగు మొహాలతో తప్పెట 'ధమధమ'లకు అణుగుణంగా పేట తుళ్ళి ఆడుతూ వావర్‌స్వామి దర్గాకు వెళ్ళాము.

వావర్‌స్వామి అయ్యప్పస్వామి జతగాడంట.

ముస్లిం అంట.

వాళ్ళ స్నేహానికి గుర్తుగానే ఈ చిన్న ఉత్సవమంట.

పేటతుళ్ళి ఆడిన తరువాత ఆ పక్కనే వున్న నీళ్ళలో స్నానం చేయాలన్నారు.

వెళ్ళి ఆ నీళ్ళ దగ్గర నిలబడ్డాం నేనూ, ప్రసాద్.

స్నానం మాట దేవుడెరుగు. కానీ ఆ నీళ్ళల్లో కాలైనా పెట్టబుద్ధి కావడం లేదు. అంత కంపు కొడుతున్నాయ్.

అవి లక్షమంది వాడిన మురికినీరే కానీ, వాడదగిన నీరు మాత్రం కాదు అని మా మొహాలు చూస్తే ఎవరికైనా అర్థమౌతుంది.

నేనూ, ప్రసాద్ ఆ నీళ్ళను చూస్తూనే నిలబడ్డాం.

నీళ్ళల్లో మునిగినవారందరూ మొహాలు వికారంగా పెట్టి బయటకు వస్తున్నారు నోట్లోని నీళ్ళనీ, ఎంగిలినీ 'ప్థూ... ప్థు' అని వుముస్తూ.

మీరు నమ్మండీ, నమ్మకపోండీ కానీ నిజం చెప్పాలంటే మా ఇంటి దగ్గర సైడు కాలవలో ఇదే వాసన.

'ఆ పైన ఇద్దరు ముస్లిలోళ్ళు నీళ్ళల్లోకి దిగి మళ్ళీ పైకి రాలేదంట' అని.

'ఆహా!' అన్నాడు ప్రసాద్ చేతులు రెండూ పైకెత్తి.

'ఏం స్వామీ?'

'పుణ్యాత్ములు వాళ్ళు...' అన్నాడు ఎత్తిన చేతులు దించకుండానే.

'ఇది వాళ్ళ పుణ్యమో? లేక ఈ నీళ్ళ అనుగ్రహమో ఎవరికెరుక?'

ఏం చేద్దామన్నట్టు ప్రసాద్‌వైపు తిరిగాను.

(ముగింపు వచ్చేవారం)